పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 05.07.2014

ఎంసెట్ అడ్మిషన్లకు ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని కోరుతూ సుప్రిం కోర్టుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శనివారం విద్యా శాఖ మంత్రి జి.జగదీశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ రాంచందర్ రావు, విద్యా శాఖ కార్యదర్శి వికాస్ రాజ్, సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ శైలజారామయ్యార్, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నాగిరెడ్డి, సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రేమాండ్ పీటర్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, సీనియర్ అధికారులు అజయ్ మిశ్రా, స్మితా సబర్వాల్ తదితరులతో విద్యా శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సుప్రిం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆగష్టు ఒకటి నాటికి ఎంసెట్ అడ్మిషన్ల ప్రక్రియను ముగించాల్సి వుందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఈ గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయడం ఎంతవరకు సాధ్యమనే విషయంలో చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన కు సంబంధించి కావలసినంత అధికారులు లేరని, ప్రభుత్వ పరంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు చాలా వున్నందున ఆగష్టు ఒకటి లోపు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయడం సాధ్యం కాదని ముఖ్యమంత్రితో సహా అంతా అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని సుప్రిం కోర్టుకు తెలపాలని గడువు పొడగించాలని కోరాలని ముఖ్యమంత్రి కేసిఆర్ అడ్వకేట్ జనరల్‌ను కోరారు. తెలంగాణలో 320 మంది సివిల్ సర్వీస్ అధికారులు వుండాలని, కాని ప్రస్తుతం 70 మంది మాత్రమే వున్నారని వీరితో అన్ని పనులు సకాలంలో చేయడం సాధ్యం కావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రిం కోర్టుకు అప్పీలు చేయనుంది. అక్టోబర్ చివరి వరకు గడువు పొడగించాలని ప్రభుత్వం తరపున సుప్రిం కోర్టును కోరాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రిం కోర్టులో గడువు పెంపు కోసం అప్పీలు చేయనున్నారు.

---